క్లుప్తంగా

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

• ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి

భోగాపురం: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కేవలం పలు శాఖల అభివృద్ధిపై సమీక్షించారు. ఎటువంటి తీర్మానాలు చేయకుండా సభను ముగించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పడాల సత్యవతి, ఎంపీడీఓ దాసరి బంగారయ్య, ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సక్రమంగా 'సఖి' గ్రూపులు



సమావేశంలో మాట్లాడుతున్న మేనేజర్ విశ్వేశ్వరరావు

నెల్లిమర్ల: బాలికలు, మహిళల ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన సఖి గ్రూపులను సక్రమంగా నిర్వహించాలని నగర పంచాయతీ మేనేజర్ టీవీఎస్ విశ్వేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో పాఠశాలలు, కళాశాలల సఖి గ్రూపు ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు.

చలివేంద్రం ఏర్పాటు



ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

నెల్లిమర్ల: మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవి ప్రారంభమైన దృష్ట్యా ప్రభుత్వ కార్యాలయాలకు విచ్చేసే సందర్శకుల దాహార్తిని తీర్చేందుకు తాగునీటిని అందుబాటులోకి తీసుకొచ్చామని ఎంపీడీఓ జి. గిరిబాల తెలిపారు. మండలంలోని అన్ని సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ విధిగా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

బలవంతపు పెట్టుబడులు ఆపాలి



నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నెల్లిమర్ల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎల్ఐసీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇతర జాతీయ బ్యాంక్‌ల నుంచి వేరే రంగాల్లోకి బలవంతపు పెట్టుబడులు పెడుతోందని, దీన్ని ఆపాలని డీసీసీ అధ్యక్షుడు సరగడ రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వ బలవంతపు పెట్టుబడులకు వ్యతిరేకంగా పట్టణంలోని ఎస్‌బీఐ వద్ద సోమవారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు కనకల పద్మనాభం, ఎస్. సూరిబాబు, నరసింహులు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఈశ్వరరావు

విజయనగరం ఫూల్‌బాగ్: పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు ఏవిధంగా సన్నద్ధం కావాలి అనే అంశంపై కంటోన్మెంట్‌లోని నగర పాలక ఉన్నత పాఠశాలలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డైట్ లెక్చరర్ (సైకాలజీ) డి. ఈశ్వరరావు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం. కాంచన, ఉపాధ్యాయులు కేవీ సతీష్‌కుమార్, ఎం. నిర్మల, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం ఫోర్ట్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో నగరంలో మంగళవారం ఉదయం 7 నుంచి ఎనిమిదన్నర గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ పి. నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గజపతినగరం, ఉడాకాలనీ, బుచ్చన్న కోనేరు ఫీడర్ల పరిధిలో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

హోరెత్తిన ప్రచారం...



భోగాపురం: మాజీ ఎంపీ కొమ్మూరు సంజీవరావు నివాసంలో జరిగిన సమావేశంలో సీతంరాజుకు మద్దతు తెలియజేయాలని కోరుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



విజయనగరం : జిల్లా కేంద్రంలోని 21వ డివిజన్‌లో సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్లవీరభద్రస్వామి, తదితరులు



విజయనగరం: జిల్లా కేంద్రంలోని బ్యాంక్ కాలనీ, అలకనందా కాలనీల్లో ప్రచారం చేస్తున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన, అవనాపు విక్రమ్, తదితరులు



డెంకాడ: మండల కేంద్రంలో సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు బంటుపల్లి వాసుదేవరావు, రొంగలి కనకసింహాచలం, పిన్నింటి తమ్మునాయుడు, తదితరులు



పూసపాటిరేగ: కొవ్వాడలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు తదితరులు



నెల్లిమర్ల: సీతంరాజును గెలిపించాలని ప్రచారం చేస్తున్న చిక్కాల సాంబశివరావు, చిక్కాల సంతోష్, మజ్జి గణేష్, తదితరులు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఎంపీ, జిల్లా, మండల ప్రజా ప్రతినిధులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్ల వద్దకు నేరుగా వెళ్లి వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్

నోటిఫికేషనే తరువాయి..

• సింగవరం ఎంపీటీసీ స్థానానికి తుది ఓటర్ల జాబితా సిద్ధం
• డి. తాళ్లవలస వార్డుమెంబర్ ఎన్నిక కూడా..



సింగవరం సచివాలయం

డెంకాడ: మండలంలోని సింగవరం ఎంపీటీసీ స్థానంతో పాటు డి.తాళ్లవలస ఏడో వార్డు మెంబర్‌కు సంబంధించిన ఓటర్ల తుది జాబితాలను అధికారులు సిద్ధం చేశారు. 01.01.2023 అర్హత తేదీగా ఓటర్ల జాబితాలను అధికారులు ఆయా కార్యాలయాల్లో వేలాడదీశారు. దీంతో ఎన్నికలకు కావాల్సిన అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇవ్వడమే తరువాయి అధికారులు ఎన్నికలు నిర్వహిస్తారు. కొద్దిరోజుల కిందట సింగవరం ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు పిట్టా పద్మావతి పోటీ చేసి రెండు ఎన్నికల్లోనూ విజయం సాధించారు. దీంతో సర్పంచ్‌గా ఉంటూ ఎంపీటీసీ స్థానానికి పద్మావతి రాజీనామా చేశారు. దీంతో ఎంపీటీసీ స్థానానికి ఎన్నిక నిర్వహించాల్సి ఉంది. అలాగే డి.తాళ్లవలస ఏడో వార్డు మెంబర్ తోరోతు సీతమ్మ మరణించింది. దీంతో ఈ వార్డు మెంబర్ స్థానం ఖాళీ కావడంతో ఇక్కడ కూడా ఎన్నిక అనివార్యమైంది.

మహిళా ఓటర్లే కీలకం..

సింగవరం పంచాయతీ పరిధిలో సింగవరంతో పాటు నాతవలస పంచాయతీలున్నాయి. సింగవరం పంచాయతీలో 1450 ఓటర్లు ఉండగా అందులో పురుష ఓటర్లు 695 మంది కాగా మహిళా ఓటర్లు 755 మంది ఉన్నారు. నాతవలస పంచాయతీలో 1103 మంది ఓటర్లు ఉండగా పురుష ఓటర్లు 547 మంది కాగా 556 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. సింగవరం ఎంపీటీసీ పరిధిలో పురుష ఓటర్ల కంటే 69 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. డి.తాళ్లవలస ఏడో వార్డు పరిధిలో 134 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 72 మంది పురుష ఓటర్లు కాగా 62 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.

'స్పందన'ను వినియోగించుకోండి



స్పందనలో పాల్గొన్న అధికారులు, కార్యదర్శులు

నెల్లిమర్ల: మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎంపీడీఓ జి.గిరిబాల అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతివారం మండల స్థాయిలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రానున్న సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా స్పందన కార్యక్రమం ఉండదని, తర్వాత అన్నివారాల్లో కార్యక్రమం ఉంటుందని, ప్రజలు తమ సమస్యలను తెలియజేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేబీ రమణరాజు, ఈఓపీఆర్డీ భానోజీరావు, ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు, ఏపీఎం ఎల్. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అధిక వడ్డీ

• ఎస్‌బీఐ ఆర్ఎం సీవీ సుబ్రహ్మణ్యం



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ ఆర్ఎం సీవీసుబ్రహ్మణ్యం

విజయనగరం అర్బన్: అత్యధిక వడ్డీ ప్రయోజనం కల్పించే ఫిక్స్‌డ్ డిపాజిట్లను అందుబాటులో తీసుకువచ్చామని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ సీవీ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎస్‌బీఐలో అత్యధిక వడ్డీ ప్రయోజనాలిచ్చే ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అవగాహన కల్పిస్తూ సోమవారం నగరంలో ర్యాలీ చేపట్టారు. ఎస్‌బీఐ ఆర్ఎం కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బ్యాంకింగ్ రంగంలో వినియోగదారులకు అధికవడ్డీ ప్రయోజనం కలిగించే పలు పథకాలను ఎస్‌బీఐ అందిస్తోందన్నారు. అందులో అమృతకలశ్, సర్వోత్తం డిపాజిట్లు ముఖ్యమైనవన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఎంపీఎస్టీ అధికారి బండారు సూర్యారావు, ఎస్‌బీఐ కంటోన్మెంట్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ జయంతి శ్రీనివాసరావు, పట్టణంలోని వివిధ బ్రాంచ్‌ల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే స్పందన



విజయనగరం రూరల్: స్పందన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ వెంకటరావు, తహసీల్దార్ బంగార్రాజు

విజయనగరం రూరల్: అర్జీదారుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి సోమవారం మండల కేంద్రాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గంటా వెంకటరావు, తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి మండల శాఖ అధికారులతో పాటు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యలు తెలియజేసేందుకు జిల్లా కేంద్రానికి వెళ్లకుండా, మండల కేంద్రంలో తెలియజేసేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను అధికారులు, సిబ్బంది పరిష్కరించాలని సూచించారు.

స్పందనలో రెండు వినతులు ..

డెంకాడ: మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో రెండు వినతులు వచ్చాయని ఎంపీడీఓ స్వరూపారాణి తెలిపారు. పెదతాడివాడ, అక్కివరం గ్రామాల నుంచి రెండు వినతులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

• డీపీఎం ఆనందరావు

డెంకాడ: ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని డీపీఎం ఆనందరావు అన్నారు. మండలంలోని అమకాంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో విత్తన గుళికలను తయారు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ విత్తనాలు భూమిలో వేస్తే వర్షం వచ్చేవరకు విత్తనం పాడవదన్నారు. అలాగే చీడపీడలు కూడా ఆశించవని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకురాలు వనజ, ఎస్ఎఫ్ఏ మెర్సీ, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ విజయానికి సమష్టిగా పని చేద్దాం

• గృహసారథుల సమావేశంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

గంట్యాడ: గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీని మరింత పటిష్టం చేసి రానున్న ఎన్నికల్లో మళ్లీ పార్టీ విజయం సాధించడమే లక్ష్యంగా గృహసారథులు, పార్టీనాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సమష్టిగా సైనికుల్లా పని చేద్దామని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని పెదవేమలి, మురపాక, సిరిపురం, రామవరం, లక్కిడాం, వసంత గ్రామాల్లో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేయడమే లక్ష్యంగా గృహసారథులను నియమించినట్లు చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ కార్యకర్తలు అంతా ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని వివరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకోవాలని చెప్పారు. అలాగే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ఆయా గ్రామాల్లోని పట్టభద్రులను కోరారు. విశాఖపట్నంలో ఇటీవల నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైందని, రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు, పెట్టుబడులు పెట్టేందుకు అంబాని లాంటి బడా పారిశ్రామికవేత్తలు ప్రభుత్వంతో ఎంఓయూలు కుదుర్చుకున్నారని వివరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, ఎంపీటీసీ పాటుపురెడ్డి భవాని, సర్పంచ్ వర్రి పాపునాయుడు, పార్టీ నాయకులు నారాయణమూర్తిరాజు, పి.నారాయణమూర్తి, రంభ సత్యారావు, లచ్చిరెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.